


ఆదివిష్ణు

ఏవిటో అనుకుంటున్నాడు ఫూల్!

వీడికి నావిషయంబొత్తిగా తెలిస్తేవదు. ఇన్నేళ్ళు నాతో కలిసి తిరిగిన మనిషైతే కావచ్చుగానీ. అంతమాత్రాన నేను 'అర్ధమైపోతే' యిక నా ప్రత్యేకత ఏంగాను? వీడనుకుంటూన్న ప్రేమలూ, దోమలూ నాకు చాలా దూరంగా వుండాలి. వుంటాయి.

నాకు జిలేబి యిష్టం; ముంత మషాలా యిష్టం. నేతి గారెలూ. బిరాణీ గింజలూ. బర్మన్ సంగీతంలాగానే ఇంకోడి కవిత్వం — యివన్నీ నాకు చాలా యిష్టం. అలాగే, నాకనేక రకాలైన అభిప్రాయాలూ వుంటాయి. నాయిష్టాల్నీ, అభిప్రాయాల్నీ కాదనే హక్కు వీడికెక్కడిది? అలా అని ఎవడు రాసిచ్చేడు? రాస్కెల్. ఎంత ఆయాసపడి తిట్టేడు నన్ను! నేను దాచుకు మాటాడే మనిషినైతే ఈ వెధవ నాకు దండేసి జైకొట్టేపని! నేనేం దాచుకునే మనిషిని కాదుగనకే — ఆఫ్టరాల్ ఈ పీనుగ్గాడితో మాటపడాల్సి వొచ్చింది.

* * *

సాధారణంగా, చిరంజీవి ఎవర్నీ యింత కటువుగా తిట్టుకోడు. ఆరోజు మాత్రం అలా తిట్టుకోక తప్పిందికాదు...

చిరంజీవికి సత్యమనే స్నేహితుడున్నాడు. సత్యం చాలా విషయాల్లో నత్రకాయే! ఎప్పుడోగాని అతని నోరు పెగలదు. నోరు పెగిలినా ఆ మాటాడే విషయం ఏవంత కొత్తదీ, వినేందుకు విడ్డూరంగా వుండేదీ కాదనే గ్యారంటీ యివ్వొచ్చుననే అభిప్రాయం చిరంజీవికున్నది.

అలాంటి దోరోజు సాయంత్రం ఆరున్నర ప్రాంతాల, చిరంజీవి పార్కులో సభతీర్చిన వేళ — సత్యం లేటుగా రావడమేంగాకుండా పిడుగులాటి వార్తని చిరంజీవి చెవిని వేసేడు.

"మా చెల్లి పెళ్ళి."

"ఎవరిది?" ఉలిక్కిపడి అడిగేడు చిరంజీవి.

"మా చెల్లిపెళ్ళి."

"మీచెల్లి..."

"అవును. మా చెల్లి పెళ్ళి, ఏంవినబడ్డం లేదా?"

చిరంజీవి మళ్ళా మాటాడలేకపోయాడు.

— పార్కులో మనుషుల తగ్గిపోతున్నారు. చిరంజీవి చుట్టూతావున్న అతని స్నేహితులు సైతం ఒక్కొక్కరే లేచి వెళ్ళిపోడం ప్రారంభించేరు.

వేళ, ఎనిమిదిన్నరకి చేరింది. సత్యం అన్నాడు —

"అంతా వెళ్ళిపోయేరు,"

"అవును, చూసేను, నువ్వూ వెళ్ళిపో సత్యం. అందరూ వెళ్ళిపోండి."

"అంత కసిగా వున్నావే?"

"కసిగానా?"

"అవును. కసిగానే వున్నావు."

"నీ మొహం. నా కెందుకూ కసి... పెళ్ళవుతుంది నాక్కాదుగా!"

"మా చెల్లి..."

"చెప్ప కింక. సిగ్గులేకపోతే సరి. పెళ్ళట...పెళ్ళి."

సత్యాని కోపం వొచ్చింది. చాలా కష్టంగా అన్నాడు.

"నోరు పారేసుకోవద్దు. ఒక ఆడపిల్ల, అందునా, నాచెల్లెలు పెళ్ళని చెప్పేదివిజమే. నా చెల్లెలికి పెళ్ళవుతుందని నేను సిగ్గుపడాలా? అంత అవసర మేవిటి?"

"పోనీ, నువ్వు కాపోతే నేను సిగ్గుపడతాను. బాధపడతాను. సరా?"

"యూ... ఏవిటి నువ్వు పేలేది? ఇందాకూడా అంతమంది స్నేహితుల్లో రెట్టించి ఎగతాళిగా అడిగేవ్. ఇప్పుడు చెబుతున్నాను — అంత ఎగతాళి చేసినా స్నేహితుడివి గనక బ్రతికిపోయావ్. తెలుసా."

"నా పేరే చిరంజీవి. నే నంత సులువుగా చావను."

"అవున్రా! ఇప్పుడు అడుగుతున్నాను చెప్పు. ఏం? నా చెల్లికి పెళ్ళికాకూడదా? అది పెళ్ళికి తగదా?"

"అంత వేడెక్కిపోయి అడక్కు సత్యం. నే విప్పుదేం చెప్పినా నువ్వర్థం చేసుకో

లేవు. నువ్వు చల్ల బడింతర్వాత నేనే చెబుతాను."

సత్యం చిరాగ్గా లేచి వించున్నప్పుడు చిరంజీవి పకపకా నవ్వేసి, తన చేతినిచాచి అన్నాడు —

"బులెట్‌లాటి వార్తని తెచ్చి గుండెల్లో దూసేవ్. లేవలేన్రా సత్యం. కొంచెం సాయం చెయ్యి."

సత్యం చిరంజీవిని నించోబెట్టాడు.

"థేంక్స్. మరి నాలుగురోజులవరకూ కనిపించకు. మనసు దెబ్బతింది. నన్ను ఒంటరిగా తిరగనిస్తే అదే పదివేలు... నీ దారటు. నాదారిటు. బై..."

—సత్యానికి చిరంజీవి వరసేం నచ్చ లేదు.

నిజమే - సాధారణంగా, చిరంజీవి ఎవ్వర్నీ ఎప్పుడుగూడా నొప్పించడు. అతని మాటతీరు కొంచెం కటువుగా వున్నా, స్నేహాని కతను చాలా దగ్గిరవాడు. అలాంటిది పద్మ పెళ్ళిమాట విని వినటంతోనే అతను దెబ్బతిని కోయినందుకు సత్యం ఆందోళన చెందేడు.

సత్యం ఇంటివేపు నడుస్తూండగా ఒక చిన్న అనుమానం అతని మనసుని మరింత పాడుచేసింది.

చిరంజీవి పద్మని ప్రేమించేడా?

తరచూ యింటికొచ్చే మనిషి చిరంజీవి. అందునా, కొంచెం చొరవున్న మనిషేమో- సత్యం లేని వేళల్లోగూడా యింటికి రాక పోకలు చేస్తునే వుంటాడతను.......

అక్కడ్నుంచి యింక ఆలోచించలేక పోయాడు సత్యం. వేగంగా యింటికి నడిచేడు. ఇంట్లో మనుషులంతా పెళ్ళి పనుల్లో నిండామునిగివున్నారు. అత నెవర్నీ పలుకరించకుండా తిన్నగా పద్మగదిలోకి వెళ్ళేడు. పద్మ ఏదో పుస్తకాన్ని చదువు కుంటూ కూచుంది.

అన్న రావడం చూచి పుస్తకాన్ని మూసింది పద్మ.

"శుభలేఖలు అచ్చు కిచ్చి వొచ్చేను," అన్నాడతను.

"నాన్నారితో చెప్పు. నాకు చెబుతావేం?"

పెళ్ళికూతురివిగా..."

"అయితే?"

"మరేం లేదు. నాకు నచ్చిన డిజైన్ నీకు నచ్చుతుందో లేదోనని భయంగావుంది. చూస్తానంటే నమూనా రెడీగావుంది."

పద్మ పకపకా నవ్వినప్పుడు, సత్యానికి చిరంజీవి గుర్తుకొచ్చేడు.

"నాకు నచ్చకపోడంగూడానా? బలే వాడివన్నయ్యా! ఎవరో చూడటానికొచ్చేరు, వాళ్ళకోమాటు కనుపించు పద్మా అని అమ్మ అన్నప్పుడుగానీ తెలీదు నాకు - పెళ్ళి చేసుకోడానికి కైమైందని! నాన్నారు వరుడ్ని వేటాడి పట్టుకోడం, కట్నకానుకలూ-లాంఛనాలూ వగైరా అన్నీ వాళ్ళతో మాట్లాడటం, పెళ్ళిచూపులకి వాళ్ళని పిలవడం ఇవన్నీ నాకు తెలిసే చేసేరా? ఏమిటో నువ్వుత్త వెర్రివాడివిగనక ఆఫ్టరాల్ - శుభలేఖ తాలూకు డిజైన్ నీకు నచ్చుతుందా పద్మా అని పనిపెట్టుకు అడగటానికొచ్చేవ్. ఎన్నెన్నో మహత్తరమైన నిర్ణయాలకి తలూపేసుగదా, చివరికి నోటీసు కాగితానికి వంకపెడతానని ఎల్లా అనుకున్నావ్? నీకా అనుమానం ఎందుకృలిగింది."

"పద్మా! నే నోటి అడుగుతానుగాని నిజం చెబుతావా?"

"ఏమో, హామీ లివ్వడం అంతమంచిది గాదు."

"నీకీ పెళ్ళి యిష్టమేనా?"

పద్మ మళ్ళా నవ్వేసింది. నవ్వి అన్నది.

"థేంక్స్... కనీసం నువ్వైనా ఈ ప్రశ్న అడిగేవ్. ఈ యింట్లో అమ్మకీ నాన్నకీ తోచని ప్రశ్న నువ్వైనా అడిగేవ్. కొన్నేళ్ళు గడవనివ్వు. మా అమ్మాయికి సంబంధాలు వెతికేపూచీ నువ్వే పుచ్చుకుని మాటలో మాటగా అప్పుడీ ప్రశ్నని అడిగితే బాగుంటుంది. అంతవరకూ జవాబు చెప్పలేను."

"మొండితనం విడిచిపెట్టి నిర్భయంగా చెప్పు. నీకీ పెళ్ళి యిష్టమేనా?"

"నిజం చెప్పేందుకు మనసు రావడం లేదు. అబద్ధం చెప్పాలనుకుంటే కొంతకాలం గడవాలి,"

"అంతేనా?"

"యస్ యువరానర్, అంతే."

"మించిపోయిం దేమీలేదే పద్మా! నీ మనసులోమాట దాచకుండా చెప్పంతే. శుభలేఖలన్నీ నాజేబులోనే దాచుకుంటాను. నాన్నారితో స్వయంగా నేనే మాటాడి..."

"ఎంత సాహసం! ఎవరైనా వింటే నవ్వుతారుగాని, నువ్వెళ్ళి నీపని చూచుకో. నోరు మూసుకోడంలో ఎన్నెన్ని పద్ధతు లున్నాయో నీకంటే నాకే బాగాతెలుసు. మనసూ, త్యాగం యివన్నీ చదువుకో డానికేగానీ మరెందుకూ ఉపయోగించ వన్నయ్యా... సిరిగల యింట్లో అడుగు పెట్టబోతున్నాను వెళ్ళిపో బాబూ! నీకో నమస్కారం."

సత్యం ఆగదినుంచి నీరసంగా వొచ్చేసేడు.

పద్మపెళ్ళి దగ్గిర పడుతున్నకొద్దీ సత్యానికి ఆందోళన ఎక్కువవుతోంది. చిక్కుప్రశ్న ఒకటి అతని ఆలోచనల్లో చేరి మనసుని పాడుచేస్తున్నట్టు గమనించ గలిగేడు. ఈ ప్రశ్నకి పద్మనుంచి జవాబు రాదుగాక రాదు.

తన అనుమానం నిజమే అవుతే జవాబు? చిరంజీవి అద్దెగదికి వెళ్ళేడు.

చిరంజీవి ఆగదిని ఖాళీచేసే ప్రయత్నం పసిగట్టి అడిగేడు —

"ఎక్కడికైనా ప్రయాణమా?"

"హైదరాబాద్ బదిలీ అయ్యింది." అన్నాడు చిరంజీవి.

"మరి చెప్పేవుకాదే?"

"నేను రేపు ఉదయం వెళ్ళాలి, ఈ రాత్రికెలాగో నిన్ను కలుసుకుని చెబుదా మనుకున్నాను. సమయానికి నువ్వే వొచ్చావ్."

"మామూలు పరిస్థితుల్లో అయితే ఇప్పుడిలా వొచ్చేవాడినేకాదు.''

"విశేషమే ?"

"కావలసినంత. నేనిప్పుడు వేడిమీద లేను. నువ్వేం చెప్పినా అర్థం చేసుకునేంత చల్లగా వున్నాను. నువ్వేం చెప్పదలుచుకున్నావో చెప్పు."

అప్పుడు చిరంజీవి సూటిగా అడిగేడు –

"పద్మపెళ్ళి గురించేగదూ !''

''అవును.''

"నువ్వు వేడిమీద వున్నా, చల్లబడినా నేను చెప్పదలుచుకున్న దేదో నీకు అర్థమయ్యే భాషలోనే చెబుతాను. నీకు తెలీనిభాషలో చెప్పేందుకు ఆ భాషేదో నాకుమాత్రం రావద్దు ? కాని సత్యం, నేను చెప్పింది విని నన్ను గౌరవించలేవేమోనని నాభయం. అందుకని నేనా విషయాన్నిక విడిచిపెట్టేసేను.''

చిరంజీవి భుజమ్మీద బలంగా చేతులుంచి సత్యం అన్నాడు.

"నా సహనాన్ని పరీక్షిస్తే నేనూరుకోను. మరోవిషయంలో నన్ను అవమానించినా నేను బాధపడను. ఇది నా చెల్లి పెళ్ళివిషయం. చెప్పదలచుకున్న దంతా యిప్పుడిక్కడీ క్షణంలోనే చెప్పి నిన్ను నువ్వు కాపాడుకో. ఇవాళైనా బయటపడి మాటాడు. కమాన్, క్విక్.''

చిరంజీవి సత్యంచేతుల్ని తొలగించి, వెళ్ళి ట్రంకుపెట్టెమీద కూచున్నాడు. సిగరెట్టు ముట్టించుకుని అన్నాడు.

"నువ్వెంత ఫూల్ వో నాకు బాగాతెలుసు. విషయమంతా విన్న తర్వాత నన్ను ఫూలని అంటే నే నొప్పుకోను. కెన్నై ప్రొసీడ్ నౌ ?"

"ప్రొసీడ్ !" అన్నాడు సత్యం భయం భయంగా.

''నువ్వు నాతోపాటు కలిసి చదువుకున్నావు. ఒకటి రెండేళ్ళు కాదు. ఆరేళ్ళు. డిగ్రీలు పొందేంగనుక నాగరికులమనే చెప్పాలి. వెల్ – నేను పిచ్చివెధవనికాను.





చాలా తెలివిగలవాడిని. కాపోతే నీకు లేని అదనమైన అర్హత ఒకటుంది నాకు. అది అందమైన మనసు। దాన్నవతలికినెట్టి అసలు విషయానికి వొద్దాం; పద్మ నీ చెల్లెలు. అది నీ అదృష్టం. దేవుడున్నా డని నువ్వూ నేనూ వొప్పుకుంటాం. దేవుడులేడని ఏవడైనా అంటే నేను వర్రీ కాను. ఎందుచేతంటే చాలా అందమైన వొస్తువులో నేను దేవుణ్ని చూస్తాను. గలగలపారే సెలయేటి, మనసుకి హాయిగా, మెత్తగా – హొయలుగా వీచే గాలి, సూర్యభగవానుని మనోహరమైన ఉదయాస్తమానాలూ, శరద్రాత్రి తాలూకు వెన్నెలకాంతి – కవితా దృష్టి అవి కొట్టి పారేయకు – వీ టన్నింటిలో నేను దేవుణ్ని చూస్తాను. అఫ్‌కోర్స్, ఇదీ నీకు అర్థంకాదు. నెక్స్ట్, బహుంకొద్ది మంది మనుషుల్లోనే నేను దేవుణ్నిచూసేను. పదేళ్ళక్రితం పోయిన నా తమ్ముడిలో దేవుడున్నాడు. రాస్కెల్ ... ఎంతందంగా వుండేవా డనీ। మనిషిని భూమ్మీదకి చేర్చే ప్రయత్నం దేవుడే చేస్తాడనిగదా మన నమ్మకం. నా దృష్టికి చాలామంది మనుషులు వికృతంగా వుంటారు, లేదూ అతి సాధారణంగా కనిపిస్తారు. వాళ్ళందర్నీ నేను మనుషులనే పిలుస్తాను. సృష్టికర్తకి మూడ్బావున్న అదృష్టఘడియల్లో, ఆయన అతి శ్రద్ధగా కొందర్ని తయారుచేసి భూమ్మీదికి పంపుతాడు. ఎక్కడో ఎప్పుడో నాకు

అలాటి వనుషులు కనిపించక మానరు. ఆ మనుషుల్ని చూచినప్పుడు నేను విచలితుడనవుతాను. అలాటి మనుషుల్ని తయారు చేసిన సృష్టికర్తకి చేతులెత్తి నమస్కారం చేస్తాను. కదలకురా సత్యం ... అలా కూర్చుని వినంతే. నాకు తెలుసు_ ఈ విషయముపట్ల నీకు ఆసక్తి తక్కువ. నన్ను అడిగావుగనక వినక తప్పదు. విను. మీ పద్మలోగూడ నేను దేవుడ్నే చూసేను. ఆయన పనితనానికి ముగ్దుడినయ్యాను. పద్మ కేవలం ఒక ఆడపిల్లంటే నేను చస్తే ఒప్పుకోను. దేవుడు ప్రేమకొద్దీ తయారుచేసిన రమణీయమైన రూపం. ఈ రూపానికి నాశనం కూడదు. అలాంటి పద్మకి పెళ్ళవుతే సత్యం _ ఒకసంవత్సరం చాలు ... పద్మలోని దేవుడు పారిపోగలడు. అందుచేత పద్మలాటి ఆడపిల్లలకి పెళ్ళి తగనే తగదు.''

సత్యం సర్దుకూర్చుని సూటిగా అడిగేడు.

"నీ అభిప్రాయం వొదిలేయ్ నువ్వు పద్మని ప్రేమించేవా లేదా ?"

చిరంజీవి మెల్లిగా నవ్వి అన్నాడు.

"మంచి ప్రశ్నే. ఈ ప్రశ్నే మనల్ని అల్లరిపెట్టిందనీ తెలుసు. నేను పోజుకొట్టి మాటాడటం కాదుగానీ ప్రేమంటే ఏవిటో నీకు తెలుసా అసలు ? పోనివ్వు నేను చెబుతాను విను. మనం ఫైనల్ బి. ఏ. లో వున్నప్పుడు కనకంగాడుకస్తూర్ని ప్రేమించాడని విన్నాము. కస్తూరి తల్లి కాబోతుందని విన్నతర్వాతనే కనకంగాడు ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. అవునా ? దాన్నిగూడ మనం ప్రేమనే పేరుపెట్టాం. అయితే, ఆ రకంగా నేను పద్మని ప్రేమించడం లేను. ప్రేమించను. అసలు మీ పద్మకి పెళ్ళి కాకూడదురా బాబూ అంటే వినవేం ? పద్మ అందానికి పెళ్ళనేది హానిచేస్తుందని అంటున్న వాడిని, నేనా రకంగా పద్మనెందుకు ప్రేమిస్తాను ?"

''మరి ఏరకంగా ప్రేమిస్తున్నావోయ్ ?"

' అదిగో మళ్ళా వేడెక్కిపోతున్నావ్, మెల్లిగా అడుగు. నే నిందాక వెన్నెల రాత్రులూ, సెలయేఋల గురించి పొయిటిగ్గా చెప్ప ప్రయత్నించేను విన్నావుగా... అక్కడ వాటి నెలా ప్రేమించేనో ఇక్కడ మీ పద్మనీ. అలాగే ప్రేమించేను. అర్థమైందా ?"

''అయితే, నువ్వు పెళ్ళి చేసుకునే మాటేమిటి ?"

''నేను తప్పనిసరిగా పెళ్ళి చేసుకుంటాను. పద్మలాంటి అమ్మాయినికాదు. మామూలు ఆడపిల్లని. దేవుడులేని ఆడపిల్లని ఉదాహరణకి. కనకంగాడుకస్తూర్ని చేసుకున్నట్టే నేనూ ఎవరో ఒకచిత్రాంగిని చేసుకోకతప్పదు...''

— సత్యానికి విసుగుపుట్టింది. అక్కడ్నుంచి వెళ్ళిపోతూ, రెండు వొడ్డించి వెళ్ళేడు.

''నువ్వింత ఇడియట్ వనుకోలేదు ప్రేమించేనని చెప్పేందుకు గట్సులేని సన్నాసివి. ఐ నో యిట్. ఇంతసేపూ, నీ పిరికితనాన్ని దాచుకుని యాక్టుచేసేవ్. అయి దేదో అయిపోయింది. ఇకనుంచైనా ధై ముగా, అనుకున్న మాటని అనుకున్నట్టు చెప్పడం అలవాటు చేసుకో...నిన్ను చిత తందామనే వొచ్చేను. కవిత్వంచెప్పి నన మాయచేసేవ్. నిన్ను నమ్మను గా నమ్మను. గుడ్‌బై ..."

— చిరంజీవికి తల వాలిపోయిన పనయింది. నిజంచెప్పినా విన్పించుకో వెధవతో స్నేహం ఎందుకు పొడిగించే అని అతను విచారించేడు.

సరిగ్గా అక్కడే, ఈ కథ ప్రార మైంది.

* * *

"లక్షింపతి సింపుల్‌గా పతి అని పిలు సరిపోతుంది," అన్నాడు లక్ష్మీపతి.

"చిరంజీవి. పొడుగూ, పొట్టీ అం ఆ పేరే," అన్నాడు చిరంజీవి.

రంగనాధరావు పేకముక్కలు పంచే

—వరసగా నాలుగు ఆటలూ వస రావే గెలిచేడు. వరసగా నాలుగు కౌం ముట్టచెప్పేడు లక్ష్మీపతి.


వసంతరావు పేకముక్కలు క పంచడం ప్రారంభించేడు.

రంగనాధరావు ఆశగ ఒక్కో ముక్క చూస్తున్నాడు.

లక్ష్మీపతికి డబ్బుమీదగల నిర్లక్ష్యా చిరంజీవి వొక్కడే నొచ్చుకున్నాడు.

లక్ష్మీపతి అన్నాడు —

"క్లైయిమేట్ డల్‌గావుంది. మొ



పూనాలో వున్నాను. అక్కడా యిదేవరస. వెధవ ముసురు. ఎవర్రా అక్కడ? ఇల్లా రా. బీరువాలో త్రీఎక్స్ వుంది పట్రా. గెస్టులొచ్చేరు. చూసేవుగా. వెళ్లు. ఆం, ఏవిటి చెబుతున్నానూ, క్లయిమేట్ గురించి కదూ, దీందుంపతెగ ఈ ముసురుచూస్తుంటే ఫ్లూ వొచ్చిన పేషెంట్నై పోతాను. రేపు నాగపూర్ వెళ్ళాలి. ఏం వెళ్ళడమో ఏవిటో. జీవితానికి సుఖంలేకుండాపోతోంది. జోకరేవిటి పంతులూ, మళ్ళా ఆరు ముక్కేనా? ఆరేళ్ళనుంచీ నాకూ ఈ ముక్కకీ బద్ధ విరోధం. అయితేనేం ఆడక పోతే తోచ్చావదు. వెరీ బేడ్."

లక్ష్మీపతి జీవితంలో సుఖంలేదని చెప్పినప్పుడు చిరంజీవి ఆశ్చర్యపోయేడు. పేరుకి తగ్గట్టు లక్ష్మీపతి లక్షల కధికారి. దేశాన్నంతా తన వ్యాపారదక్షతో వాణికించి పారేస్తున్న మనిషతను. రాజప్రాసాదం లాటి యింత చక్కటి భవనంలో, కనుసైగకే చిత్తమనే నౌకర్లూ – ఇంద్రభోగాల మధ్య లక్ష్మీపతికి సుఖం లేదంటే హాస్యంగానేవుంది మరి.

అయినా, ఈ పెద్దవాళ్ళమాటల్ని పట్టించుకోడమేవిటి నాన్‌సెన్స్, అనుకున్నాడు చిరంజీవి. ఈ లక్ష్మీపతిగురించి రంగనాధరావు యింతకుమును పనేకసార్లు చెప్పేడు. ఇవాళ పనిగట్టుకొచ్చి, ఆ శ్రీమంతునింట్లో ఏర్పాట్లుచూచి మతిపోగొట్టుకుంటూన్న చిరంజీవికి–అవతలా పెద్దమనిషి జీవితంలో సుఖమే లేదన్నప్పుడు చిరాకు కలిగింది.

లక్ష్మీపతి ఎనుబోతులా వుంటాడు. అడవుల్లో విచ్చలవిడిగా తిరిగే పెద్దసైజు జంతువులానూ వుంటాడు. అందుచాత అతని క్కావలిసిన సుఖం ఏవిటోగాని, అది కొందరి పెద్దజాతకులకీ కొత్తనిపించవొచ్చనే ఆలోచనగూడా చిరంజీవికితట్టింది.

—వొచ్చినవాడు, ఆ యింట్లో పనిమనిషైనా నీటుగా వున్నాడు. రమ్ సీసాతోనూ, కొన్ని గ్లాసులూ యితర సామగ్రితోనూ టేబిల్‌దగ్గరకొచ్చి వినయంగావించున్నాడు.

అప్పటికి ఆటమాత్రం రంగనాథరావే గెలిచేడు.

లక్ష్మీపతి మళ్ళా కౌంట్ యిచ్చేడు. కౌంట్ యిచ్చి, పేకని అవతలపెట్టి, చేతులు రుద్దుకుంటూ పనిమనిషి తీసుకొచ్చిన సామగ్రిని అందుకున్నాడు.

గబగబా గ్లాసులోకి రమ్‌ని వొంచేడు. అందరిముందూ ఆగ్లాసుల్ని వుంచేడు.

"సారీ! నాకలవాటు లేదు" అన్నాడు చిరంజీవి.

ఫెళ్ళున నవ్వేడు లక్ష్మీపతి.

"బలే గెస్ట్‌ని తెచ్చావయ్యా రంగనాధం. ఇది విష మనుకుంటున్నాడల్లే వుంది. భయపడుతున్నాడు. విషంకాదని చెప్పు. ఇది తాగినంత మాత్రాన మనిషి చచ్చిపోడు... క్వాలిటీలో చీప్ అయినా కిక్‌లో మాత్రం మహాగొప్పది. ఇన్‌ఫారం చెయ్యకుండా వొచ్చేరుగనుక రమ్. ముందే చెప్పినట్టయితే వేట్‌సిక్స్‌టీ నైన్ దొరికేది. ఏం చేస్తాం, విధి. పుచ్చుకోండి."

లక్ష్మీపతి మాటలకి చిరంజీవి బాధపడ్డాడు. ఆమాటల్లో ధ్వనించిన డబ్బువాసనని గ్రహించి చిన్నబుచ్చుకున్నాడు. తప్పలేదు. అందర్తోపాటు చిరంజీవి తాగేడు.

పేకాట పూర్తిగా ఆగిపోయింది. నాలుగు వరసలు రమ్ సేవించేరు. చిరంజీవి కప్పుడు చిత్రంగా రెక్కలొచ్చినట్టు తోచింది. ఇంకా తాగడం మంచిది కాదనుకుని, మూతి తుడుచుకుంటూ – అతి కష్టం మీద థేంక్స్ అనగలిగేడు.

అప్పుడూ లక్ష్మీపతి వెకిలిగా నవ్వేసి అన్నాడు —

"కొత్తపక్షిని మళ్ళా ఎన్నాళ్ళకి చూసేనోయ్ రంగనాధం. నీకునేను థేంక్స్ చెప్పుకోవాలి. సీసాలుబిగించే నీలాటి బ్రూట్స్‌తో తాగడం అలవాటునాకు. అందుచేత ఎవడెలా డాన్స్ చేసేది చూడటం పడదు. అందరూ అందరే అన్నట్టు ఒకడికి ఒకడు తీసిపోని ఆ కంపెనీలో థ్రిల్స్ తక్కువ. ఇదిగో... ఇలాటి కొత్తపక్షులున్న కంపెనీలోనే మజా వుంటుంది. రెండేళ్ళ క్రితం మావూరి కుర్రాడు దొరికేడు. ఈ మందు వాసన్తోనే పాటలు పాడేంత ఆవేశం వాడికి, బొత్తిగా కొత్త... నిండా ముంచేసేను. వాడేం మాటాడుతున్నాడో ఏవిటో... తెగ అల్లరిచేసేడు. ఆతాగిన తిమ్మిరిలో చచ్చిపోతానని ఏడిచేడు... నేను చచ్చిపోతానని కాదు... వాడే... వాడే చచ్చిపోతాడని... గమత్తేవిటంటే... వెధవ, చివరికి వాడు చావలేదు... విష్



విషేపంగా బల్ ... బతికేసేదు. తాగు బ్రదర్...నీపేర్...ఏవిటి...సుబ్రావ్... సుబ్రావ్... నీకిష్ట మొచ్చినంత... ఫర్వా లేదు. తాగమ్మా..."

లక్ష్మీపతికి కళ్లు మూసుకుపోతున్నట్టు చిరంజీవి పసిగట్టేడు. పీపాలుతాగడం దేవు డెరుగు – ఒకచుక్కతో నాలుక తడిస్తే ఆనాలుక తెగిపోవాలేగాని – మంచి ముక్క ఒకటి బయటకి రాదని అతని వాలకమే చెబుతోంది.

లక్ష్మీపతి కుడి ఎడమ భుజాలు ఈ రంగనాథరావూ, వసంతరావూను. వాళ్ళకి లక్ష్మీపతి దుర్మార్గం నచ్చినంతగా, అతని స్నేహం నచ్చదని గూడ గమనించేడు.

అందువాత, అతను లేచి సెలవు పుచ్చుకుని బయటకొచ్చేడు.

అతను రోడ్డుమీద నించుని, మనిషి మొత్తాన్నీ కదిపేస్తున్న మందు విశేషానికి నొచ్చుకున్నాడు. నడిచి యిల్లు చేరుకోడం సాధ్యమైన పని కాదని నిశ్చయించుకున్నాడు. దూరాన ఆగివున్న టాక్సీని గొంతెత్తి పిలువబోయేడుగానీ – లక్ష్మీపతి బంగళా నుంచి కారు వొచ్చి తనదగ్గిర ఆగడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.

డ్రైవరు కారుదిగి వెనకడోరు తెరిచి పట్టుకుని వినయంగా అన్నాడు.

"దొర కారు పంపిండు."

చిరంజీవి వెనకసీట్లో కూచుని, కళ్ళు మూసుకుపోతుండగా ఇంటి నెంబరూ వగైరాలు చెప్పేడు.

—డ్రైవరు సాయంతో ఇంట్లోకి అడుగుపెట్టిన చిరంజీవి ఆకారాన్ని చూచి విస్తుపోతూ అడిగింది శాంత.

"ఏం జరిగిందండీ ! ఏం జరిగిందీ ?"

డ్రైవరు వెళ్ళిపోయిం తర్వాత చిరంజీవి చేసిన తప్పుని సాధ్యమైనంత క్లుప్తంగా వివరించి చెప్పేడు శాంతకి. అంతా ఓర్పుగా విన్నది శాంత. కళ్ళల్లోకి నీళ్ళు పొంగి వస్తున్నప్పుడు, రెండు చేతుల్తో మొహాన్ని కప్పుకుని కుళ్ళికుళ్ళి ఏడ్వడం ప్రారంభించింది.

అప్పుడు చిరంజీవి మనస్సు చివుక్కుమన్నది.

"నన్ను తిట్టేయ్ శాంతా. నీ ఇష్టమొచ్చినట్టు తిట్టు. మనకి పెళ్ళయిన ఈ మూడు సంవత్సరాల్లోనూ నీ కన్నీరు చూళ్ళేదు నేను. ఇవాళే చూసేను. ఫర్లేదు నన్ను తిట్టేందుకు భయపడొద్దు. తప్పుచేసి వొచ్చేన్నేను. మళ్ళా ఇలాంటి తప్పుడుపని చెయ్యకుండా బుద్ధిచెప్పు... ఇదిగో... అలా నీలో నువ్వే కుమిలిపోతూ వెళ్ళిపోతుంటే నా కెంతబాధగా వుందో తెలుసా ? నువ్వునన్ను తిట్టివుంటే ఈ బాధకి కొంత ఉపశమనం కలిగేది... వెళ్ళిపోతున్నావా? రైట్ తిట్టవుగా యింక. నువ్వు తిట్టకపోయినా నేను ప్రామిస్ చేస్తున్నాను – మళ్ళా జన్మలో తాగను. మన బుజ్జిమీద ఒట్టు!"

ఆరాత్రి శాంత వేరేగదిలో పడుకుంది. బుజ్జికి ఏంచెప్పిందో ఏమో. వాడు తండ్రి దగ్గిరికి రానేలేదు. తాగిన భర్తమీద భార్యకి యింత తీవ్రమైన ద్వేషం కలుగుతుందా? అయితే లక్ష్మీపతి బ్రతుకు మాటేమిటి ?

ఇక అతను అట్టే ఆలోచించలేకపోయాడు. నిద్రకి లొంగిపోయేడు.

ఒకనాటి సాయంత్రం ఆఫీసైన తర్వాత ఇంటికి వొచ్చేందుకు బస్‌కోసం వెయిట్ చేస్తున్న చిరంజీవిని లక్ష్మీపతికారుడ్రైవరు పలుకరించి అన్నాడు –

"అమ్మ పిలుస్తుంది."

"ఎవరోయ్ అమ్మ ?"

"పద్మమ్మ. కారులో వుంది."

పద్మ పేరు వినడంతోటే చిరంజీవి గుండె గబ గబా కొట్టుకున్నది. లక్ష్మీపతికీ పద్మకీ గల బంధుత్వాన్ని మొదటిసారిగా తెలుసుకున్న అతడు తడబడుతూ కారుని చేరుకున్నాడు.

పద్మ నమస్కారం చేసి 'గుర్తున్నానా?' అని అడిగినప్పుడు, చిరంజీవి పద్మవేపు కళ్ళార్పకుండా చూస్తూ ఆశ్చర్యపోయాడు.

నాలుగేళ్ళ వైవాహిక జీవితంలో పద్మ కొంచెంగూడ నలిగిపోలేదు. పై పెచ్చు నాలుగేళ్ళక్రితం కన్నా యిప్పుడే మరింత శోభాయమానంగా మెరిసిపోతోంది. తన సిద్ధాంతం ప్రకారం పెళ్ళయిన రెండు మూడేళ్ళ కాలంలో ష్వరుళ్ళూ, చీకాకుల్తో పూర్తిగా నలిగిపోయినవాళ్ళ నెంతమందిని చూసేడుగాదూ ? ఈ పద్మ వీటన్నింటికీ అతీతమైన పడుచా ? ఇదే నిజమైతే, ఆనాడు సత్యంతో తను వెళ్ళబోసుకున్న అభిప్రాయాలన్నీ అబద్దాలే! ఎందుకూ పనికిరాని కూతలు.

"గుర్తుపట్టినట్లు లేదు" మళ్ళా పద్మే అన్నది.

"గుర్తున్నారు, నేనెలా మరిచిపోతాను?"

"ఇక్కడే వుంటున్నారా ?"

"నాలుగేళ్ళనుంచీ ఇదేనగరం. చిక్కడపల్లిలో కాపురం."

"చాలా కాలానికి కనుపించేరు. రండి. కారెక్కండి ప్లీజ్..."

చిరంజీవి కారులో కూచున్నాడు. కారు తిన్నగా లక్ష్మీపతి బంగళాదగ్గిర ఆగింది. పద్మ ఒక లేడిపిల్లలా ఛెంగు ఛెంగున గెంతుతూ భవనంలోకి దారి తీస్తున్నప్పుడు – ఆయింటి వైభవమూ, ఆ యింటాయన అనాగరికతా, అతని సొసైటీ, వాళ్ళ విందులూ పండుగలూ, సరదాలూ కాలక్షేపాలూ గుర్తుకొచ్చిన చిరంజీవి పద్మ పరిస్థితిని వూహించ నారంభించేడు.

ఇద్దరూ సోఫాల్లో కూచున్నారు. డ్రింకులొచ్చేయి, పుచ్చుకున్నారు.

"ఎల్లావుంది మాయిల్లు ?"

"ఇంతకు మునుపొకసారి యిక్కడికొచ్చేను."

"మీరా ? వొచ్చేరా ?"

"అవునేం ?"

"అయితే మావారు మీకు స్నేహితులేనన్నమాట."



"లక్షపతిగారేగా. స్నేహితులు కారు గానీ, నా స్నేహిడికి స్నేహితులు. అంతే. అదే పరిచయం. కానీ, గమ్మత్తేమిటంటే మీరు వారి శ్రీమతని తెలీదు."

పద్మ మాటమార్చే ఉద్దేశంతో అడిగింది.

"పెళ్ళి చేసుకున్నారా?"

''ఒక పిల్లాడు గూడాను.''

"వెరీగుడ్," అన్నది పద్మ

కాసేపు మవునంగావుండి అన్నది –

"... మావారి గురించి మీకు తెలిసే వుంటుంది. లక్షలమీద వ్యాపారం. కొండంత పరపతి...నెల కిరవై రోజులు వారు ఇంట్లో వుండరు. ఇంట్లోవున్నా లక్ష వ్యాపకాలు. క్షణం తీరుబడిలేని వ్యాపార సంబంధాలు. ఇప్పుడు నాగపూర్‌లో వున్నారు. ఏమిటో గడిచి పోతోందికాలం.''

''అదృష్టవంతులు!''

"నేనా!"

''అవును."

ఆమె పేలవంగా నవ్వేసి అన్నది –

''ఈ అదృష్టాన్ని పెళ్ళికాక మును పే వూహించేను. అయితే, మరీ యింత ఘోరమైన అదృష్టమని అప్పట్లో అనుకో లేదు. వేళాకోళమని కొట్టిపారేస్తే నే నేం చేసేది లేదు గాని. నే నిక్కడ రా యి లా బ్రతుకుతున్నాను. కాకపోతే, ఇది సామాన్య మైన రాయికాదు. లక్షలవిలువచేసే స్టోనిది. వజ్రాలూ, వైఢూర్యాలూ దాచుకుని గొప్పలు చెప్పుకునే వేనిటీలో నే నో వ జ్రాన్నీ వైడూర్యాన్నీ మాత్రమే! ఈ విషయం మావా రైతే మరికొంచెం యింపుగా చెప్ప గలరు."

''పద్మగారూ!''

''లేకపోతే ఎందుకొచ్చిన కాంప్లిమెం ట్సండీ! మనిషిని ఆకాశాని కెత్తేస్తారేం మీరంతా? నన్ను చూస్తుంటే మీకు జాలి కలగడంలేదూ? అక్కడ అమ్మా నాన్నా గూడ యిదేమాట ... అదృష్టంట ... అదృష్టం ... లక్షలున్నాయనా, లేక పేలె

స్లో వుండి బంగారాన్ని భోంచేస్తున్నాననా అదృష్టం? నా స్థితి మీ భార్యకి చెప్పి చూడండి చిరంజీవిగారూ–నేనెంత అదృష్టవంతురాలినో ఆవిడైనా గ్రహించ గలుగుతుంది ... క్షమించండి. చాలా ఆవేశంగా మాటాడేను. ఇంకో డ్రింక్ తీసుకుంటారా?"

"నో థేంక్స్."

"నన్నోతడవ మీ యింటికి తీసుకెళ్ళరూ..."

"మా యింటికా?"

"అవును...మీ బాబు కెంతవయస్సు? మాటలొచ్చా వాడికి? పోనీ ఒకపని చెయ్యండి ... నాలుగురోజులపాటు వాడినిక్కడ వుంచండి...అయ్యో, అదేమిటది? అప్పుడే లేచేరేం...కూచోండి సార్."

"ఇంకోమాటు వొచ్చికూచుంటాను ఇవాళ నన్ను వెళ్ళిపోనివ్వండి. ఈమాటు నా భార్యనీ, బాబునీ పట్టుకొస్తాను. బాబు మీకు అలవాటు కావాలేగాని నాలుగురోజులేంఖర్మ నాలుగు సంవత్సరాలపాటు మీ దగ్గిరే వుంచుకోండి. సరేనా? బై..."

అతను రోడ్డుమీదికి వెళ్ళగానే, తన వెనగ్గా లక్ష్మీపతి కారువొచ్చి ఆగింది. డ్రైవరు కారుదిగి ఏదో చెప్పబోతూండగా చిరంజీవే అన్నాడు.

"పద్మమ్మ పంపేరా? వెల్...మా ఇల్లు తెలుసుగా. తీసుకెళ్ళు." చిరంజీవి కారెక్కి కూచున్నాడు.

ఇంటిదగ్గిర కారు ఆగినప్పుడు, బుజ్జినెత్తుకుని గుమ్మందగ్గిర నించున్న శాంత రివ్వున యింట్లోకి వెళ్ళిపోయింది. చిరంజీవి యింట్లోకి వొస్తూనే అన్నాడు–

"ఐయామాల్‌రైట్ శాంతా! భయపడకు"

శాంత చిరంజీవికి దగ్గిరగా వొచ్చి, మనిషిమొత్తాన్ని తనికీ చేసిం తర్వాత కోపంగా అన్నది–

"ఏవిటండి ఈ ఉత్సవాలు? ఆ దిక్కుమాలిన కారుని చూస్తుంటే నాకేవిటో దడగా వుంటుంది. మళ్ళా ఎప్పుడూ ఆ కారెక్కి రాకండి. పుణ్యమాయిరి."

— ఆ ఉదయం సత్యం చిరునామాకి ఉత్తరం రాసేడు.

"నేను నమ్మిన థియరీని మీ చెల్లెలు దెబ్బతీసింది సత్యం." నా థియరీ అంత సుళువుగా ఫెయిలవకూడదు. అలాంటిది యిక్కడింత దారుణంగా ఫెయిలవడానికి గల కిటుకు నేను కనిపెట్టేను. పద్మ నిత్యం అపరంజి బొమ్మలా వుండాలనుంటే ఆ యిల్లూ, ఆ వాతావరణమే శ్రేయస్కరం!

జీవితంలో మూడంకెలు దాటని జీతగాడి యింట్లో అపరంజిబొమ్మ లరుదు. ఏవైతేనేం, పద్మకి మంచిసంబంధం వెతికేరు. అందుకొరకైనా నేను మీ అందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకోవాలి. ★

